క్లుప్తంగా

నరసాపురం ఎంపీడీఓగా రామకృష్ణంరాజు



ఎంపీడీఓ రామకృష్ణంరాజును అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: నరసాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జీవీఎస్ రామకృష్ణంరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఉండ్రాజవరం, కృష్ణాజిల్లా బంటుమిల్లి ప్రాంతాల్లో ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఈయన ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా నరసాపురం ఎంపీడీఓగా వచ్చారు. ఈయన గతంలో నరసాపురం మండలపరిషత్ కార్యాలయలో కార్యాలయ పర్యవేక్షణాధికారిగా పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓను కార్యాయసిబ్బంది, గ్రామకార్యదర్శులు అభినందించారు. తొలుత బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో ఎమ్మెల్యే నాయకర్‌ను మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈఓపీఆర్డీగా నాగేంద్రకుమార్.

నరసాపురం ఈఓపీఆర్డీగా కాకర్లమూడి నాగేంద్రకుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కాకినాడ రూరల్ ఎంపీడీఓగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో నరసాపురం వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఈఓపీఆర్డీ ఆంజనేయశర్మ ఉండ్రాజవరం బదిలీ అయ్యారు.

వెలుగు డీఆర్‌డీఏ ఏపీఎంగా నాయుడు



నాగభూషణం నాయుడు

నరసాపురం రూరల్: సాధారణ బదిలీల్లో భాగంగా వెలుగు డీఆర్‌డీఏ నరసాపురం ఏపీఎంగా జక్కంపూడి నాగభూషనం నాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయనతో పాటు కొప్పర్రు క్లష్టర్ సీసీగా కేవీ సత్యనారాయణ, తూర్పుతాళ్లు క్లష్టర్ సీసీగా టి.సుందరరావు బాధ్యతలు చేపట్టారు. ఏపీఎం నాగభూషణం నాయుడు గతంలో నరసాపురం, మొగల్తూరు, పాలకోడేరు లలో ఏపీఎంగా పనిచేశారు. నరసాపురం లేసుపార్కు మేనేజర్‌గా కూడా ఈయన పనిచేశారు. ప్రస్తుతం ఆకివీడు ఏపీఎం పనిచేస్తున్న ఈయన బదిలీపై నరసాపురం వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన పద్మ పెనుమంత్ర బదిలీ అయ్యారు.

మొగల్తూరు కార్యదర్శిగా నాగేశ్వరరావు



ముచ్చర్ల నాగేశ్వరరావు

మొగల్తూరు: మొగల్తూరు పంచాయతీ కార్యదర్శిగా ముచ్చర్ల నాగేశ్వరరావు(చిన్న) శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కార్యదర్శిగా విధులు నిర్వహించిన గంగన్న యలమంచిలి మండలానికి బదిలీ కాగా పాలకొల్లు రూరల్ మండలంలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావును మొగల్తూరుకు బదిలీ చేశారు. కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నాగేశ్వరరావు, ఎంపీడీఓ త్రిశూల పాణి, సర్పంచ్ పడవల మేరీ, ఉపసర్పంచ్ బోణం నర్సింహరావు, వార్డు సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు.

పెనుగొండ ఎంపీడీఓగా సూర్యనారాయణ మూర్తి

పెనుగొండ: పెనుగొండ ఎంపీడీఓగా టి.సూర్యనారాయణ మూర్తి బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా వేలూరుపాడు నుంచి పెనుగొండకు బదిలీపై వచ్చారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించడంతో, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆయనను అభినందించారు. అదేవిధంగా పెరవలి నుంచి పెనుగొండకు ఏఓగా ఎస్ రమేష్, సీనియర్ అసిస్టెంట్‌గా ఏ వేణుగోపాలరావులు బదిలీపై రావడంతో బాధ్యతలు స్వీకరించారు.

ఆచంటలో..

ఆచంట మండల అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఎస్ స్వరా శ్రీకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఆకివీడు నుంచి ఆచంటకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

పాలకొల్లు ఎంపీడీఓగా ఉమామహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన సంగాని వెంకటేశ్వరరావు టి.నరసాపురం బదిలీ అయ్యారు.

పలువురు కార్యదర్శులు బదిలీ

పాలకొల్లు మండల ఈవోపీఆర్‌డీగా పనిచేసిన కేఎం వైభవతి పోడూరు మండల ఈవోపీఆర్‌డీగా బదిలీ అయ్యారు. పాలకొల్లు రూరల్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్నా) మొగల్తూరు పంచాయతీ కార్యదర్శిగానూ, దగ్గులూరు పంచాయతీ కార్యదర్శి ఎస్ మల్లేశ్వరరావు యలమంచిలి మండలం కట్టుపాలెం పంచాయతీ కార్యదర్శిగాను, ఆగర్రు పంచాయతీ కార్యదర్శి ఎం ఆనందబాబు నరసాపురం మండలం కొప్పర్రు పంచాయతీ కార్యదర్శిగానూ, దిగమర్రు పంచాయతీ కార్యదర్శి ఓదూరి సూర్యప్రకాశరావు (రాజా) యలమంచిలి మండలం ఏనుగువానిలంక పంచాయతీ కార్యదర్శిగానూ, ఉల్లంపరు పంచాయతీ కార్యదర్శి డీఎస్ పద్మాజీరావు భీమవరం మండలం రాయలం పంచాయతీ కార్యదర్శిగానూ, పూలపల్లి పంచాయతీ కార్యదర్శి లింగం సత్యనారాయణ ఉల్లంపర్రు పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. వీరంతా శుక్రవారం ఆయా పంచాయతీల విధుల నుంచి రిలీవ్ అయ్యారు. పాలకొల్లు మండల పరిషత్ ఏఓగా పనిచేస్తున్న కొర్రా గోవిందరాజులు నరసాపురం పంచాయతీరాజ్ శాఖకు బదిలీ అయ్యారు.

లడ్డూ వివాదంపై స్వతంత్ర సిట్ హర్షణీయం

- కూటమి ప్రభుత్వానికి సుప్రీం తీర్పు చెంపపెట్టు
- ప్రజాప్రతినిధులు, సామాజిక వాదుల స్పందన

తిరుమల లడ్డూ విశిష్టతను దెబ్బతీస్తూ నిరాధార ఆరోపణలతో సీఎం చంద్రబాబు నాయుడు బహిరంగ ప్రకటనలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. చంద్రబాబు వైఖరిని సుప్రీంకోర్టు కూడా తప్పుబట్టింది. కల్తీ అయిన లడ్డూను పరీక్షలకు పంపించకుండా కల్తీ నెయ్యితో లడ్డూలను చేశారని ఎలా చెబుతారు? అని సుప్రీంకోర్టు చంద్రబాబుని ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను రద్దు చేస్తూ స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వతంత్ర కమిటీ నిష్పక్షపాతంగా విచారణ చేసి లడ్డూ వివాదానికి ముగింపు పలకాలని కోరుతున్నారు.

– పాలకొల్లు అర్బన్

లడ్డూ విశిష్టతను చంద్రబాబు దెబ్బతీశారు



తిరుమల లడ్డూ విశిష్టతను చంద్రబాబు దెబ్బతీశారు. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ప్రకటన చేసి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. దేవుడున్నాడని రుజువైంది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని స్వతంత్ర సిట్ ఏర్పాటు చేసింది. దీంతో నిజానిజాలు వెలుగులోకి వస్తాయి. సిట్ నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి వాస్తవాలను రాబడుతుందని ఆశిస్తున్నా.

– నడపన గోవిందరాజుల నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు, పాలకొల్లు

సుప్రీం కోర్టు సిట్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయం



సుప్రీంకోర్టు సిట్‌ను ఏర్పాటు చేయడం స్వాగతిస్తున్నా. ఈ సిట్‌లో ఇద్దరు సీబీఐ అధికారులు, ఇరువురు రాష్ట్ర పోలీస్ అధికారులతో పాటు ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారితో కలిసి కమిటీ వేయడం అభినందనీయం. నిజానిజాలు త్వరలోనే వెలుగుచూస్తాయి. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా అణగదొక్కాలనే ఉక్రోషంతో చంద్రబాబు తొందరపాటు వ్యాఖ్యలు చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీశారు.

– కర్రా జయసరిత, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి

తిరుమల ఆలయ ప్రతిష్టను కాపాడాలి....



తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను కాపాడే విధంగా సుప్రీంకోర్టు నియమించిన అధికారులు వాస్తవాలను వెలికితీయాలి. టీటీడీ ఈఓ శ్యామలరావు కల్తీ నెయ్యి వాడలేదని బహిరంగంగా ప్రకటనలు చేసినా చంద్రబాబు మాజీ సీఎం జగన్ లక్ష్యంగా చేసుకుని అనాలోచితంగా వ్యవహరించి హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. సిట్‌విచారణ నిష్పక్షపాతంగా జరపాలి. ఇకపై దేవుళ్లను రాజకీయాల్లోకి తీసుకురాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

– నల్లి రాజేష్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు,

చంద్రబాబువి తొందరపాటు వ్యాఖ్యలు



లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు తొందరపాటు వ్యాఖ్యలు చేశారు. పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని రాజకీయ ఊబిలోకి లాగి అబాసుపాలయ్యారు. నాలుగు ట్యాంకర్లు అనుమానంతో వెనక్కి పంపామని, వాటిని లడ్డూ ప్రసాదంలో వినియోగించలేదని టీటీడీ ఈఓ శ్యామలరావు చెబుతున్నా చంద్రబాబు వినకుండా తప్పుడు వ్యాఖ్యలు చేశారు. దేవుడు విషయంలో రాజకీయం చేస్తే ఫలితాలు వేరేలా ఉంటాయి. దీనికి చంద్రబాబు మూల్యం చెల్లించక తప్పదు.

– దేవ రాజేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి

వైభవంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు

నరసాపురం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పట్టణంలో ఘనంగా జరుగుతున్నాయి. పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. పండ్ల మార్కెట్ వద్ద 40వ దేవీ శరన్నవరాత్రి వార్షికోత్సవాల్లో భాగంగా జరుగుతున్న ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మచారిణీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. సిద్దాని గోపీ, నాగేశ్వరి, సుంకర వీరాస్వామి, హేమదుర్గ దంపతుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఉత్సవ కమిటీ సభ్యులు మండెల సత్యనారాయణ, గునిశెట్టి సత్యనారాయణ, ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాయిపేట వుంతలో ముసలమ్మ అలయం వద్ద, గోల్డ్ మార్కెట్ వద్ద స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వీవర్స్ కాలనీలో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి.



నరసాపురం: రాయిపేట సీతలమాత అమ్మవారికి పూజలు చేస్తున్న స్థానిక కౌన్సిలర్ రామసీత దంపతులు



పాలకొల్లు అర్బన్: గుత్తులవారిపేటలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



నరసాపురం: పండ్ల మార్కెట్ వద్ద బ్రహ్మచారిణీదేవి అలంకరణ



మొగల్తూరు: ఆకట్టుకున్న గాయత్రీదేవి అలంకరణ



నరసాపురం రూరల్: ఎల్బీచర్లలో గాయత్రీ దేవి అలంకరణ



పెనుగొండ: పెదమల్లంలో గాయత్రీదేవి అలంకరణ



పెనుగొండ: రాజరాజేశ్వరిగా మూలవిరాట్ వాసవీ మాత



యలమంచిలి: అడవిపాలెంలో పూజలు చేస్తున్న దృశ్యం

యలమంచిలిలో..

యలమంచిలి: అడవిపాలెం గ్రామ దేవత శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో విజయదశమి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అర్చకులు గుబ్బల పురుషోత్తం బ్రహ్మత్వంలో గ్రామానికి చెందిన కౌరు రామారావు, భవాని దంపతులు విఘ్నేశ్వరుని పూజ, కుంకుమ పూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలను తిలకించారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: దేవీనవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో కన్నుల పండువగా వేడుకలు చేసుకుంటున్నారు. రెండవ రోజున ఎల్బీచర్లలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించిన తీరు ఆకట్టుకుంది. ఆలయ అర్చకులు చరణ్ భక్తులతో విశేష కుంకుమ పూజలు చేయించారు. ఈ పూజా కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు కటకంశెట్టి త్రిమూర్తులు, రాట్నాల రాము, సుభాకర్, రఘు తదితరులు పర్యవేక్షించారు. కొప్పర్రు సెంటర్లోని దుర్గమ్మ, చినమైనవానిలంక, తూర్పుతాళ్లు గ్రామాల్లోని దుర్గమ్మ అలయం, పితాని మెరకలోని జాజులమ్మ ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు అట్టహాసంగా నవరాత్రుల వేడుకలను జరుపుతున్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: శ్రీదేవీ శరన్నవరాత్రులు సందర్భంగా రెండవ రోజు శుక్రవారం పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మహిషాసురమర్దనీ, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లు శ్రీరాజరాజేశ్వరి దేవిగా దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి అమ్మవార్లకు కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. నగరేశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించారు.

వాసవీ శాంతి థాంలో గాయత్రీ దేవిగా

అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో మరకత శిల వాసవీ మాతను గాయత్రీ దేవిగా అలంకరించారు. శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో పూజలు అభిషేకాలు నిర్వహించారు.

గాయత్రీ దేవిగా పెదమల్లం మాచేనమ్మ

శరన్నవ రాత్రి వేడుకలను ఆచంట మండలంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రసిద్ధి చెందిన పెదమల్లం మాచేనమ్మ అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆచంటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని గజలక్ష్మీ దేవిగా అలంకరించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని గుత్తులవారిపేటలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి కర్రా జయసరిత అమ్మవారిని దర్శించుకుని అన్న సమారాధన నిమిత్తం విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు జోగి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, పెచ్చెట్టి లక్ష్మీవిమల, గంగిరెడ్ల ప్రసాద్, కొండేటి రవి తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: దేవి శరన్నవరాత్రుల వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం రెండో రోజు అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పార్వతీ విశ్వేశ్వర స్వామి, భవానీ కాలనీలోని కనకదుర్గమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మొగల్తూరు కూరగాయల మార్కెట్,కుక్కల వారితోటలో ఏర్పాటు చేసిన అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు చేశారు. రామన్నపాలెం, శేరేపాలెం, కొత్తపాలెం, కాళీపట్నం, పాతపాడు, జగన్నాథపురం, కేపీ పాలెం గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు.

పాలకొల్లు పట్టణంలో..

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అలాగే దేవిశరన్నవరాత్రుల ఉత్సవాలు సందర్భంగా అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించారు. స్థానిక శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అమ్మవారిని ధనలక్ష్మి అమ్మవారిగా అలంకరించారు. స్థానిక చిత్రావి చెరువుగట్టు అచ్చుగట్లపాలెం, శ్రీ ముఖదారమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని రోజుకో అలంకరణగా ఏర్పాటుచేస్తున్నారు. శుక్రవారం గాయత్రిదేవిగా అలంకరించారు. స్థానిక యడ్లబజారు సెంటర్ శ్రీ కనకదుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు చేశారు.

చరిత్రను గమనిస్తే తెలుగు భాషా సాహిత్యం తెలుస్తుంది



సహస్రావధానులకు సన్మానం చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: తరతరాల తెలుగు చరిత్రను గమనిస్తే తెలుగు భాషా సాహిత్యాల పరిణామక్రమం అర్థమవుతుందని గురు సహస్రవదాని డా కడిమిళ్ల వరప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో క్షత్రియ సంక్షేమ పరిషత్ మరియు రసధుని సంయుక్త నిర్వహణలో తెలుగు విజయం సాహిత్య రూపక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహస్రావదాని వరప్రసాద్ మాట్లాడుతూ పురాణేతిహాసాల్లో ప్రాచీన సాహిత్యం, వర్ణన, శిల్పం, శృంగార రసం అంశాలకు ప్రబంధ సాహిత్యం, దైవభక్తికి వాగ్గేయకార సాహిత్యం, నీతి, ధర్మ, భక్తి ప్రభావాలకు శతక సాహిత్యం, ఏకాగ్రత, ధార, ధారణల వంటి ప్రతిభాపాండిత్యానికి అవధాన సాహిత్యం, సమకాలీన సామాజిక స్పృహతో నడిచే నాటక, గేయ, వచన, విప్లవ కవిత్వాల సమాహారం ఆధునిక సాహిత్యమని అన్నారు. తెలుగు సాహిత్య సమగ్రతపై నేటి యువతరానికి తెలియజెప్పే విశ్వరూప దర్శనమే తెలుగు విజయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత చేగొండి అనంతశ్రీరామ్, శతావధాని, భీమడోలు డా బలుసు అపర్ణ, విశ్రాంత హెచ్ఎం సీవీవీ సత్యనారాయణమూర్తి, శతావధాని, అబ్బిరెడ్డి పేరయ్యానాయుడు, చక్కావధానుల రెడ్డప్ప ధవేజి, రసధుని అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు, జె.జయదుర్గారావు పాల్గొన్నారు.

టీడీపీ, బీసీ కులాల మధ్య విగ్రహాల వివాదం



నిర్మాణాలను తొలగిస్తున్న మునిసిపల్ అధికారులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని 28వ వార్డు గుత్తులవాని పేటలో గత రెండు రోజులుగా బీఆర్ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న స్థలంలో జరుగుతున్న విగ్రహాల నిర్మాణం టీడీపీ మాజీ కౌన్సిలర్ భర్త, శెట్టిబలిజ కులాలు మధ్య వివాదంగా రాజుకుంటుంది. బీఆర్ఎంవీ హైస్కూల్ ప్రాంతంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ భర్త ఆ స్థలంలో గాంధీజీ, ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని నిర్మాణ పనులు ప్రారంభించారు. దానితో శెట్టిబలిజ సామాజిక వర్గం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిర్మాణం పనులను అడ్డుకున్నారు. ఈ స్థలంలో విగ్రహాలు ఏర్పాటు చేయడం వల్ల తమకు కేటాయించిన కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం సరిపోదని ఆవేదన వ్యక్తంచేశారు. పాత బీఆర్ఎంవీ హైస్కూల్ ప్రాంగణం పక్కన ఖాళీ స్థలం ఉందని అక్కడ ఆ విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గత నాలుగు రోజులుగా నిర్మాణ పనులు ఆపాలని చెబుతున్నా టీడీపీ నేత నిర్మాణం పనులు మాత్రం చేయిస్తూనే ఉన్నాడు. ఇంక చేసేది లేక ఆ ప్రదేశంలో శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన స్థానిక నేతలు దౌర్జన్యంగా నిర్మాణం చేస్తున్న ఆ టీడీపీ నేతకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన కీలక నేతల ఫొటోలతో ఓ ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. అనంతరం శెట్టిబలిజ సామాజికవర్గం నేతలు పార్టీలకు అతీతంగా మంత్రి రామానాయుడును కలవడంతో విషయం గ్రహించిన మంత్రి నిమ్మల సమస్యను పరిరిస్తానని హామీ ఇవ్వడంతో శెట్టిబలిజ సామాజికవర్గం సభ్యులు సంయమనం పాటించారు. శుక్రవారం మునిసిపల్ అధికారులు వచ్చి నిర్మాణాలు తొలగించారు.

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి

పెనుగొండ: టీడీపీ కూటమి ఇచ్చిన ఉచిత ఇసుక హామిని తక్షణం అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్ధాంతం రావిచెట్టు సెంటర్ వద్ద ఇసుక రాపు రహదారిలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఉచిత ఇసుక విదానాన్ని ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటుతున్నా అమలు చేకపోవడం దారుణన్నారు. ఇసుక అందుబాటులోకి రాక తాపీ, వడ్రంగి, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, రాడ్ బెండింగ్, వెల్డింగ్ వంటి రంగాలకు చెందిన లక్షలాది మంది భవన నిర్మా కార్మికులు ఉపాధి కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్. సూర్నిడి వెంకటేశ్వరరావు, చింతకాల బాబూరావు, కౌరు పెద్దిరాజు, కర్రి నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్, వి వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం వైకుంఠ రావు, రామకృష్ణ, ముచ్చర్ల త్రిమూర్తులు, ఇసుక బంటా సంఘ అధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీనివాసరావు, లారీ వర్కర్స్ సంఘ అధ్యక్షుడు నక్కా సత్యనారాయణ, త్రిమూర్తులు పాల్గొన్నారు.

మాలలంతా మరో పోరాటానికి సిద్ధం కావాలి

పాలకొల్లు సెంట్రల్: మాలలంతా ఇప్పటికైనా ఏకమై మరో పోరాటానికి సిద్ధం కావాలని పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షులు పండుల అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దాఖలు చేసిన రివ్యూ పిటీషన్‌లను కొట్టివేశారన్నారు. రాజ్యాంగంలో ఉన్న వెసులుబాటును బట్టి న్యాయపోరాటం కోసం మరో న్యాయనిపుణులతో చర్చించి ముందుకు వెళ్తామని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, జల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల మందు పంపిణీ

పెనుమంత్ర: మండలంలోని 18 గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బ్రోమోడయోలిన్ కలిపిన ఎలుకల మందును రైతులకు పంపిణీ చేశారు. మండలంలో 61 కిలోల మందును నూకల ఎరలో కలిపి 10 గ్రాములు చొప్పున పొట్లాలుగా కట్టి రైతులకు అందించారు. ఈ మందును రైతులంతా ఒకేసారి బొరియల్లో పెట్టాలని మండల వ్యవసాయ అధికారి జోషిల సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మార్టేరు ఏడీఏ హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: ఆచంట మండలంలో శుక్రవారం పెనుమంచిలి, శేషమ్మచెరువు, కోడేరుల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాలు, సచివాలయాలు, రైతుసంఘాలు సంయుక్తంగా చేపట్టిన సామూహిక ఎలుక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఎలుకల మందు పంపిణీ చేశారు. కార్యక్రంలో ఏడీఏ అడ్డాల పార్వతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసి నాయకులు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వైఎస్సార్ సీపీ నాయకులు

పెనుమంత్ర: గత ఐదేళ్ల పాలనలో ప్రజాభిమానాన్ని పొందామని, అయితే ఎన్నికల్లో అధికారం పోయిందని స్థానిక ప్రజాప్రతినిధులు ఎవరు అధైర్య పడవద్దని అందరికీ తాను అండగా ఉంటానని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. పెనుమంత్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, వేణుబాబు దంపతులు గురువారం సాయంత్రం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక ప్రాంతాల్లో రాజకీయంగా ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లార. ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చినట్లు సుభాషిని వేణుబాబు తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గుడాల గోపి, పోడూరు జెడ్పీటీసీ సభ్యురాలు గుంటూరు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలు కలుషితం కాకుండా చూడాలి



ఆర్డీఓకు వినతపత్రం ఇస్తున్న రంగారావు

నరసాపురం: నరసాపురం ప్రాంతంలో పంటకాలువలు అనేక గ్రామాలకు మంచినీటి అవసరమైన కాలువలు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని నరసాపురం మండల సర్పంచ్‌ల ఛాంబర్ మాజీ అధ్యక్షుడు కూనపరెడ్డి రంగారావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం నరసాపురం ఆర్డీఓ దాసి రాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలోని మురుగునీరంతా వేములదీని కెనాల్‌లో కలుస్తుందని అన్నారు. లక్ష్మణేశ్వరం, వైఎస్‌పాలెం, సారవ, పెదలంక, ఎల్‌బీచర్ల, దర్బరేవు గ్రామాలకు ఈ కెనాల్ ద్వారానే మంచినీరు సరఫరా అవుతుందని అన్నారు. కలుషిత నీరు తాగడం వల్ల ప్రజలు రోగాలబారిన పడుతున్నారన్నారని, తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

నేడు బూరుగుపల్లిలో నిత్యావసరాల పంపిణీ

యలమంచిలి: యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ (యూకేఎస్‌సీ) ఆధ్వర్యంలో బూరుగుపల్లి గ్రామంలో శనివారం 100 మంది నిరుపేదలకు ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గా ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు బూరుగుపల్లి గ్రామానికి చెందిన క్లబ్ సభ్యులు, ప్రముఖ వ్యాపారవేత్త పెనుగొండ సూర్యనారాయణ క్లబ్ తరపున ఉచితంగా ఈ నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నట్లు వారు వివరించారు. క్లబ్ సభ్యులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.